మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



# పదేళ్లు విద్యావ్యవస్థ నిర్వీర్యం..

**సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంచి రోజులు**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ఎంవిఎస్ కళాశాలలో హాస్టల్ భవనానికి భూమి పూజ**



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** పదియేళ్లు విద్యావ్యవస్థ నిర్వీర్యం అయ్యింది అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.క్రిష్టియన్ పల్లిలోని ప్రభుత్వ ఎంవిఎస్ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో రూ.10 కోట్లతో నూతనంగా నిర్మించనున్న బాలికల హాస్టల్ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో గత పది సంవత్సరాలు కనీస మౌలిక సదుపాయాలను కూడా గత ప్రభుత్వం కల్పించలేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థకు మంచిరోజులు వచ్చాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ఓబిసి సెల్ రాజు గౌడ్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ వేధింపులు తాళలేక మైనర్ బాలిక ఆత్మహత్య.!



నందిని (ఫైల్)

**బిజినేపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ప్రేమ పేరుతో వేధింపులు తాళలేక అవమాన భారంతో మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన వట్టెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పూడూరు నందిని (17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడింది. తండ్రి శ్రీశైలం తల్లి సుజాత తెలిపిన వివరాల మేరకు బంధువుల ఇంట్లో వివాహానికి తల్లి సుజాత వెళ్ళగా,తండ్రి శ్రీశైలం గేదెలు మేపేందుకు పంట పొలాలకు వెళ్లాడు. కాగా గ్రామానికి చెందిన సొంట మల్లేష్, శివలు కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో నందినిని వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. నందిని ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో మల్లేష్, శివలు గురువారం సాయంత్రం తగవులాడడం తో అవమానభారం భరించలేక ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విగతజీవిగా వేలాడుతోన్న బాలికను చూసిన ఇరుగుపొరుగు వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు మృతి చెందింది. విషయం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేధింపులకు గురిచేసిన వారిని నికఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు వేడుకుంటున్నారు. ఈ సంఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై కే శ్రీనివాస్ తెలిపారు.

## అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడ నిర్మాణం కూల్చివేత

**అధికారులకు, సింగిల్ విండో చైర్మన్ మధ్య వాగ్వివాదం**

**ప్రహారీ గోడలు పోలీస్ బందోబస్తు మధ్య నేలమట్టం**

**లింగాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంబట్ పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 732లో 5 ఎకరాల 29 గుంటల భూమిలో అందులో కొంత మేరకు అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడ కట్టడాలను పోలీస్‌బందోబస్తు మధ్య రెవిన్యూ అధికారులు శనివారం తొలగించారు. గత 6 రోజుల క్రితం జిల్లా, మండల సర్వేయర్లు వచ్చి సర్వే చేసి మార్కింగ్ వేసి గురువారం నాడు అక్రమ కట్టడాలను తొలగించడానికి వచ్చిన రెవిన్యూ అధికారులను, భాదితులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తుతో తహసిల్దార్ పాండునాయక్ యంఆర్ఐ సీతారాం నాయక్ శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రహారీ గోడ అక్రమ కట్టడాలను తొలగించారు. ప్రహారీ గోడ తొలగిస్తున్న సమయంలో అధికారులకు, సింగిల్ విండో చైర్మన్ ఆనంద్ రెడ్డి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కానీ మాకు కొంత సమయం ఇవ్వండి అని ప్రాధేయపడ్డ వినకుండా చివరకు పోలీసులు అడ్డువచ్చిన వారిని పక్కకు జరిపి ప్రహారీ గోడలను తొలగించారు. అక్రమ కట్టడాలలో ఎవరు అడ్డువచ్చిన కూల్చివేతను ఆపే ప్రసక్తే లేదని తహసిల్దార్ పాండునాయక్ స్పష్టం చేశారు. సర్వే నెంబర్ 732లో 5 ఎకరాల 29 గుంటల అసైన్డ్ భూమిలో ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.



రెవెన్యూ,పోలీసులకు, సింగిల్ విండో చైర్మన్ మధ్య వాగ్వివాదం

## వట్టెం వెంకన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి పూజలు

**బిజినపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి శరత్ ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ పూర్ణకుంభంతో హైకోర్టు జడ్జికి స్వాగతం పలికారు. లక్ష్మి గోదాదేవి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో అర్చక బృందం ప్రత్యేక పూజలు చేసి శేషవస్త్రం, ప్రసాదాలతో హైకోర్టు జడ్జిని సన్మానించారు. ఆలయ చరిత్ర విశేషాలు తెలుసుకొని ప్రకృతి సౌందర్యంతో ఆకట్టుకుంటున్న ఆలయ పరిసరాలు ఎంతో సంతోషాన్నిచ్చాయని భవిష్యత్తులో ఆలయం ఇంకా అభివృద్ధి చెందుతుందని హై కోర్టు జడ్జి చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు హనుమంత్ రెడ్డి,జిల్లా జడ్జి రాజేష్ బాబు, సబ్ జడ్జి సబితా,కల్వకుర్తి సబ్ జడ్జి శ్రీదేవి, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ ఇన్ చార్జి జడ్జి కావ్య, బండారు రాజశేఖర్, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వట్టెం వెంకన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి పూజలు

# ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం



- టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది అధికారులు, సిబ్బంది
- హుటాహుటిన ఘటనా స్థలానికి అధికార, మంత్రుల బృందం
- ప్రమాద ఘటన దురదృష్టకరం
- ఎనిమిది మందిని రక్షించేందకు ఆర్మీని సందించాం
- ఇప్పటికే రెస్క్యూ టీంను సంప్రదించాం..
- మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వివరాలు ఆరా తీస్తున్న మంత్రి జూపల్లి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ పనుల్లో అపశృతి చోటుచేసుకున్నది. బోరింగ్ పని మొదలుపెట్టిన వెంటనే టన్నెల్ పైభాగంలో ఒక్కసారిగా కుప్పకూలింది. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని దోమలపెంట సమీపంలో ఎడమవైపు సొరంగం 14కిలోమీటరు వద్ద శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. లోపల సుమారు 50మంది వరకు కార్మికులు సిబ్బంది ఉండగా 40మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మరికొందరిని బయటకు తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మంత్రుల బృందం,కలెక్టర్, ఎస్పీలు, ఇంజినీర్లు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

**దురదృష్టకరం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

ఎస్.ఎల్.బి.సి టన్నెల్ లో ఈ తరహా సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్.ఎల్.బి.సి టన్నెల్ తవ్వకాలలో ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకుని హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు.సంఘటనా స్థలిని పరిశీలించడంతో పాటు లోపట చిక్కుకున్న వారిని కాపాడడం కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు గాను దోమలపెంటలోని జే. పి గెస్ట్ హౌస్ లో సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి తెలంగాణా అగ్నిమాపక,రిస్క్యూ టీం డి. జి నారాయణ రావు,ఐ. జి సత్యనారాయణ నాగర్ కర్నూల్ కలెక్టర్ తో పాటు రాబిన్ సంస్థ కు చెందిన లెన్ మైనార్డ్ తో సమీక్ష సమావేశం నిర్వహించారుఅనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సొరంగంలో చిక్కుకున్న మిగిలిన ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి పని చేస్తుందన్నారుఅందు కోసం ఇప్పటికే సింగరేణి కి చెందిన రిస్క్యూ టీంలు రంగంలోకి దిగాయని, భారత ఆర్మీ కి చెందిన రిస్క్యూ టీంలతో తాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడామని ఈ రాత్రి వరకు ఆ టీం ఇక్కడికి చేరుకుంటుందని ఆయన వెల్లడించారు. అంతే గాకుండా టన్నెల్ వద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు రంగంలోకి దిగి కాపాడే టీంలతో కుడా మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఈ మధ్య కాలంలో ఉత్తరఖండ్ రాష్ట్రంలో ఈ తరహా సంఘటన చోటు చేసుకున్నప్పుడు రంగంలోకి దిగి ప్రాణాపాయం లేకుండా కాపాడిన టీంను కుడా రంగంలోకి దింపనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లతో పాటు ఉన్నత స్థాయి ప్రభుత్వ యంత్రాంగం ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు గాను ఎప్పటికప్పుడు సమాలోచనలు చేస్తూ సమిష్టి నిర్ణయం తీసుకుంటు న్నామన్నారు. అగ్నిమాపక –మిగతా4లో..





సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

### అగ్రికల్చర్ డిప్లొమా చదవకుండా నకిలీ సర్టిఫికెట్స్‌లతో

# వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు

**వ్యవసాయ శాఖలో నకిలీ ఉద్యోగాలు పొందిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు**

**నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డిఎస్పి వై.మొగులయ్య**




విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్పీ మొగులయ్య

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** అగ్రికల్చర్ డిప్లొమా చదవకుండా చదివినట్టు నకిలీ సర్టిఫికెట్స్ పొంది వాటి ద్వారా వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందిన వ్యక్తి, పరీక్షలు వ్రాసిన వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్ట్ చేసి వారి నుండి నకిలీ సర్టిఫికెట్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణ పోలీస్ కార్యాలయంలో విలేకరులతో డిఎస్పీ మొగులయ్య మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో నకిలీ సర్టిఫికెట్స్‌లతో ఉద్యోగాలు పొందిన వారి ముద్దాయిల వివరములు తెలిపారు. గద్వాల డిఎస్పి వై.మొగులయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏ 1 గా కత్రావత్ నరేష్ తండ్రి కత్రావత్ లాల్య, ఇతను ఏఈఓ (అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్) లింగోటం తాండ, గ్రామము అచ్చంపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా, ఏ 2 గా పెరుమళ్ళ నాగరాజు తండ్రి పెరుమళ్ళ నరసింహ, అగ్రికల్చర్,రాయవరం క్యాంపుగ్రామము, లింగాల మండలం నాగర్‌కర్నూల్ జిల్లా, ఏ3గా బాలకృష్ణ ప్రిన్సిపల్ మిర్యాలగూడ పట్టణానికి చెందిన ముగ్గురు ముద్దాయి వివరాలు తెలియపరిచారు. నకిలీ సర్టిఫికెట్స్‌ల ద్వారా వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందిన వ్యక్తులుగా 1.నరేష్, 2. జగదీష్, 3.శివ శంకర్, 4.రవీందర్, 5.జెరూపుల దాక్యగా గుర్తించామన్నారు.వ్యవసాయ శాఖలో కాత్రవత్ నరేష్ అనే వ్యక్తి డిప్లొమా చదవకుండా నకిలీ డిగ్రి సర్టిఫికేట్స్ పొంది వాటి ద్వారా ఏఈఓ గ్రేడ్2గా సెలక్షన్ అయి, గద్వాల నియోజకవర్గం, గట్టు మండలం, పెంచికలపాడు గ్రామము నందు ఒక సంవత్సరం, మల్దకల్ మండలము నందు ఒక సంవత్సరం డ్యూటీ చేసి తర్వాత తనకు డిప్యుటేషన్ పై 2019 మార్చి నెల నందు లింగాల మండలము కోమటికుంట గ్రామానికి బదిలీ పై వెళ్లడం జరిగిందన్నారు. ఇంటలిజెన్స్ డిపార్టుమెంటు వారు తమ విచారణలో సదరు కాత్రవత్ నరేష్ ఏఈఓ గ్రేడ్ 2 తాను డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ను గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి గాజీపూర్, ఉత్తర ప్రదేశ్ నందు చదివి పాస్ అయినట్లు సమర్పించిన డిప్లొమా సర్టిఫికేట్ – మిగతా4లో..

### ఫిర్యాదు చేసిన మహిళలపై

# వేధింపులు సిగ్గుచేటు

**పారిశుద్ధ్య కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సునందిని సస్పెండ్ చేయాలి**

**పి.సురేష్ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి**

**ప్రభుత్వ మెడికల్‌కళాశాల ఎదుట పారిశుద్ధ్య కార్మికుల నిరసన**



మెడికల్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మహిళా సిబ్బందికి రక్షణ లేకుండా పోతుందని, చర్యలు తీసుకోవాల్సిన కళాశాల ప్రిన్సిపల్ చోద్యం చూస్తూ రక్షణ కల్పించాలని ఫిర్యాదులు చేసిన మహిళ కార్మికులను టార్గెట్ చేసి వేధింపులకు గురి చేయడం సిగ్గుచేటని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆరోపించారు. వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య మహిళా కార్మికులపై సెక్యూరిటీ సిబ్బందిపై వరుసగా జరుగుతున్న వేధింపులు ఆగడాలు అక్రమ తొలగింపులు నిరసిస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం భోజన విరామ సమయంలో కార్మికులు మెడికల్ కళాశాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునందిని గౌరవప్రదమైన హోదాలో ఉండి ఒక మహిళ అధికారిగా మహిళల మానాలకు రక్షణ కల్పించాల్సిన అధికారై ఉండి మహిళల పట్ల అనుచితంగా అవమానకరంగా లైంగికంగా హింసిస్తున్న వారికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించడం హాస్యాస్పదం అన్నారు. మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగి అయిన రవి, రెగ్యులర్ ఉద్యోగి మరో వ్యక్తి మహిళా కార్మికులపై నీచ బుద్ధితో నిత్యం లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు ఇచ్చిన నేపథ్యంలో సంఘటనపై విచారణ జరపకుండా ఫిర్యాదులు ఇచ్చిన కార్మికులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగతంగా కక్షపూరితకంగా వేధింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ప్రిన్సిపల్ హోదాల ఉండి అనాధికారికంగా ఐదు మంది కార్మికులను మెడికల్ కళాశాల నుండి మహబూబ్‌నగర్ తమ సొంత ఇంటికి తీసుకెళ్లి పనిచేయించుకొని మూడు నెలలు గడిచిన తర్వాత ఆ కార్మికులపై దొంగతనం చేశారని నెపం మోపడం బాధాకరమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగి రవి పై గతంలో కూడా అనేక లైంగిక ఆరోపణలు వచ్చాయని ఒక ఔట్సోర్సింగ్ మహిళా ఉద్యోగి రవి వేధింపులపై ప్రిన్సిపల్ కి ఫిర్యాదు చేస్తే ఆ మహిళా ఉద్యోగిని తొలగించిన సంఘటన ఉందని అన్నారు. ఇప్పటికీ ఆమె 13 నెలలుగా ఉద్యోగం కోల్పోయి న్యాయం కోసం తిరుగుతుందని అన్నారు. వీరు భర్తలు లేని ఒంటరి మహిళల కార్మికులను ఎంపిక చేసుకొని చిత్రవధకు గురి చేస్తున్నారని, అనుకూలంగా మారకపోతే తప్పుడు నిందలు మోపడం పరిపాటిక మారిందని అన్నారు. కార్మికులు ఎప్పుడైతే ఫిర్యాదులు చేశారో అప్పటినుండి కార్మికుల వెనుకనే కొద్దిమందిని కేటాయించి ఫోటోగ్రాఫర్ల మాదిరిగా ఫోటోలు తీస్తూ కార్మికులకు – మిగతా4లో..

# వ్యవసాయదారులకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది

**రైతులు రాష్ట్రంలో అత్యధికంగా పామాయిల్ సాగు చేపట్టాలి**

**ప్రతి జిల్లాకు ఒక పామాయిల్ కంపెనీ స్థాపించడం ప్రభుత్వ లక్ష్యం**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** రైతుల పక్షపాతి అయిన కాంగ్రెస్ పార్టీ వ్యవసాయదారులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి వనపర్తి జిల్లాలో పర్యటించారు. వనపర్తికి చేరుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ముందు పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో 20లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఉప వైద్య కేంద్ర భవనం, మోజర్ల గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 8.38 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థం కలిగిన వ్యవసాయ గోదాముల సముదాయానికి శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా పెబ్బేరులో రూ. 5.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మరో వ్యవసాయ గోదాము 5000 మెట్రిక్ టన్నుల సామర్థం కలిగినది, రూ.44లక్షల వ్యయంతో వ్యవసాయ కార్యాలయ అదనపు భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. రూ.3.00కోట్లతో పెబ్బేరులో ఇంతకుముందు కాలిపోయిన మార్కెట్ యార్డు గోదాము పునర్నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం గోపాల్ పేట మండలం బుద్దారం గండి ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామిని దర్శనం చేసుకున్నారు. అక్కడే గోపాల్ పేట మండలం పోల్కేపాడ్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ యార్డు, ఘనపూర్ మార్కెట్ యార్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం దేవరకద్ర నియోజకవర్గంలోని సంకిరెడ్డి పల్లి గ్రామంలో ప్రీయునిక్ సంస్థ ద్వారా నిర్మించనున్న పాయిల్ ఫ్యాక్టరీకి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా పామాయిల్ రైతులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ భారత దేశంలో ప్రజలకు అవసరమైన మేరకు వంట నూనె ఉత్పత్తి లేకపోవడం వల్ల ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని తద్వారా మన ఫారెన్ నిల్వలు ఇతర దేశాలకు చెల్లించడం జరుగుతుందన్నారు. దేశంలో వంట నునెల లోటు భర్తీ చేయాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు.తక్కువ పెట్టుబడితో అత్యధికలాభం పొందే పంట పామాయిల్‌పంట మాత్రమే అని అన్నారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం ద్వారా ఎకరాకు 51 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. మొక్కల పంపిణితో మొదలుకొని డ్రిప్, 4 సంవత్సరాల వరకు అంతర్ పంట సబ్సిడీ కింది ఎకరాకు 4200 రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ కంపెనీ వారు రైతులతో ఒప్పందం చేసుకుని – మిగతా4లో..



వెల్టూరు ఉప వైద్య కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు ,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడిమేఘారెడ్డి









## విజయవంతమైన కంటి వైద్య శిబిరం



**మల్దకల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. గద్వాల శుభకర హాస్పిటల్ వారిచే నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి డాక్టర్ రవికుమార్, డాక్టర్ లావణ్య కంటి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా వందమంది కంటి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అంతకు ముందు శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు వారికి స్వామి వారి శేష వస్త్రం, చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టి శంకర్, బాబురావు, మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖరావు, పద్మా రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాదామి శ్రీనివాసులు, వ్యవస్థాపక అధ్యక్షుడు మనసాని నాగరాజు, తాటికుంట వెంకటేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉపయోగకరం

**ఎస్ఆర్ విద్యానికేతన్ డైరెక్టర్ కుర్వ రాముడు**



ఎస్ఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో క్రీడల పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రాముడు

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయాని ఎస్ఆర్ విద్యానికేతన్ డైరెక్టర్ కే. రాముడు అన్నారు. శనివారం పూడూర్ రోడ్, వీరాపురం నందు గల ఎస్.ర్ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో పూడూరు ఇండోర్, అవుట్ డోర్ క్రీడల పోటీలను డైరెక్టర్ రాముడు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. డైరెక్టర్ రాముడు జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ సెక్రటరీ రాహుల్ కి అందివ్వడంతో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమము నందు డైరెక్టర్స్ రాముడు, శ్రీకాంత్, ప్రిన్సిపల్ మహేష్, వైస్ ప్రిన్సిపల్ సుచరితలు పాల్గొన్నారు. వివిధ ఇండోర్, అవుట్ డోర్ క్రీడల యందు దాదాపు 600 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఆయా క్రీడలందు విజేతలై ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్న విద్యార్థులను డైరెక్టర్ రాముడు అభినందించారు. క్రీడల యొక్క ఆవశ్యకతను విద్యార్థులందరూ గ్రహించాలన్నారు. శారీరక దృఢత్వాన్ని పొందినప్పుడే ఉత్సాహంతో విద్యను అభ్యసించగలరని డైరెక్టర్ రాముడు క్రిడా కారులకు పలు సూచనలు చేశారు.

## మీసేవ కేంద్రాలను తనిఖీ చేసిన ఈడీఎం శివ



మీ సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఎం శివ

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల పట్టణంలోని మీ సేవ కేంద్రాలను ఈడీఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రాల లోని సిటిజన్ చార్ట్ నోటీస్ బోర్డ్, సర్టిఫికెట్ రిజిస్టర్స్ టోల్ ఫ్రీ కాల్ నంబర్స్‌ను ప్రజలకు అందిస్తున్న సేవల గురించి పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించకుండా మీ సేవలపై వచ్చిన ఆరోపణల దృష్ట్యా నిర్దేశించిన రుసుము మాత్రమే తీసుకోవాలన్నారు. అదనంగా తీసుకున్న ఎడల కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.కొత్తగా రేషన్ కార్డు సర్వీసులకు రూపాయలు 45 మాత్రమే చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. అలాగే ప్రజలకు మెరుగైన సేవలందించడమే మీసేవ కేంద్రాల కర్తవ్యం అని తెలిపారు. ధరల పట్టిక కూడా క్షుణ్ణంగా కేంద్రాలలో ఉండాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇల్లు నమూనా ప్రారంభం



ఇందిరమ్మ ఇళ్ల నమూనా ప్రారంభిస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ప్రభుత్వం త్వరలోనే లబ్ధిదారులకు అందించే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి నమూనాగా మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ప్రారంభించారు. అయితే లబ్ధిదారులకు రూపాయలు ఐదు లక్షలు చెల్లిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రెవెన్యూ గృహ నిర్మాణశాఖ ప్రాతినిధ్యం వహిస్తున్న నవాబ్‌పేట్ మండల కార్యాలయ ఆవరణలో శనివారం నమూనా ఇంటి నిర్మాణానికి ఎంపీడీవో జయరాం నాయక్, మండల అధికారుల సమక్షంలో పునాది తీసి ప్రారంభించారు. త్వరలో ప్రతి నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్ ఎంపీ ఓ. బద్రి నాయక్, ఇందిరమ్మ ఇండ్ల డివైఈఈ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** శ్రీ భక్త మార్కండేయ అచ్చంపేట శివాలయ ఆవరణలో శనివారం శ్రీశైలం వెళ్తున్న శివ స్వాములకు పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, ఫలదాన కార్యక్రమం నిర్వహించారు. శివ స్వాములు శ్రీశైలం పాదయాత్రగా వెళ్తూ వారు పూజలు నిర్వహించిన తర్వాత బిక్ష ఏర్పాటు చేయడం జరిగిందని పద్మశాలి మహిళా సంఘం, రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షురాలు దాసుపత్రి శకుంతల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 12 సంవత్సరాల నుంచి శ్రీ భక్త మార్కండేయ అచ్చంపేట శివాలయ ఆవరణలో శివ స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని శివ స్వాములకు అన్నదానం చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వనం గీత, పులిజాల కళ్యాణి, గంజి నిర్మల, కోట ప్రశాంతి, ఇమ్మడి రాజేశ్వరి, వర్కాల బాల కిష్టమ్మ, దాసు జంగమ్మ, మాకం పద్మ, కర్నాటి బాలమణి, క్యా మ పద్మ, ఎల్లికంటి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు

**దేవరకద్ర, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు చక్కగా విద్యా బోధన చేశారు. జిల్లా కలెక్టర్‌గా కె.బాలకృష్ణ, డిఇఓ గా అశ్విని కుమారి, యంఇఓగా సాయి వరుణ్ తేజ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌యంగా యం.అఖిల్ చంద్ర, పాఠశాల హెచ్‌యంగా జి.హారికలతో పాటు మొత్తం 30 మంది ఉపాధ్యాయులుగా పాత్ర పోషించి విధులు నిర్వర్తించారు. విద్యార్థు లందరు వారి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అది నెరవేర్చుకునే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చే విధంగా ప్రతి ఒక్కరు చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తు ను నిర్మించుకొని పాఠశాల పేరు చిరస్థాయిగా నిలపాలని కోరారు. చక్కటి విద్యా బోధన చేసి విద్యార్థుల మన్ననలు అందుకున్న ఉపాధ్యాయుల కు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కెకె శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్.కల్పన, ఉపాధ్యాయు లు అశ్విని చంద్రశేఖర్, విజయలక్ష్మి, టి.నాగేశ్వర్ రెడ్డి, మురళీధర్, ఆస్రఖాద్రి, శంకర్, మదన్ మోహన్, సుజాత, విద్యా వాలంటీర్ వెంకట్ రాములు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో మహీంద్రా ప్రైడ్ సర్టిఫికెట్ కోర్స్



విద్యార్థినిలకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల అటానమస్‌లో భాగంగా శనివారం టిఎస్‌కే సి టాస్క్‌వారి ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ ట్రైనింగ్ క్లాసెస్ వారం రోజుల శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో 60మంది విద్యార్థులు శిక్షణ పొందడం జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి శిక్షణ తరగతులను ఉపయోగించుకొని నైపుణ్య శక్తిని పెంపొందించుకోవాలని ఉద్యోగ అవకాశాలను మెరు గుపరచుకోవాలని తెలియజేస్తూ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అమీ నా ముంతాజ్ జహన్,టిఎస్‌కేసి కోఆర్డినేటర్ డా.హరిబాబు,టిఎస్‌కేసి మెంబర్ ఎస్.రాజ వర్ధన్ రెడ్డి, టిఎస్‌కేసి మెంటర్ పి స్వరూప, మహేంద్ర ప్రైడ్ ట్రైనర్ జి.శ్యాం కుమార్ పాల్గొనడం జరిగింది.

## కుర్తి రావుల గ్రామానికి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తేలిపిన గ్రామస్తులు**



ఎమ్మెల్యేకి శాలువా కప్పి సత్కరించిన గ్రామస్తులు

**మల్దకల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని కుర్తి రావుల చెరువు గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే ద్వారా ప్రొసీడింగును అందుకోవడం జరిగింది. ఎమ్మెల్యేకి గ్రామస్తులు శాలువా కప్పి పుష్పగుచ్చం, నోటు పుస్తకాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. మల్దకల్ మండలంలోని కుర్తి రావుల చెరువు గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ ను ప్రభుత్వంతో మాట్లాడి గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు చేయించినందుకు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తేలి పి ఆనందం వ్యక్తపరిచారు. ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచో సబ్ స్టేషన్ కావాలని రైతులు ఎన్నో రోజులుగా కోరుతూ ఉండగా ఆ గ్రామాల చిరకాల కోరిక ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే సహకారంతో కుర్తి రావుల చెరువు గ్రామానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజల కోరిక నెరవేరింది. సబ్ స్టేషన్‌కు సుమారు రూ.2కోట్లు 48 లక్షల నిధులు సైతం విడుదల చేశారు. సబ్ స్టేషన్ వల్ల నాణ్యమైన కరెంటు రావడంతో సాగునీరుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని దానివల్ల ఆరుగాలం పంటలు పండించవచ్చని దాంతో మా సమస్యలు తీరిపోతాయని తెలిపారు. ఎమ్మెల్యే కి రైతుల బాధలు తెలుసు కాబట్టే సాగు నీటికి, తాగు నీటికి, ఇబ్బంది లేకుండా కరెంటు అందుబాటులోకి వస్తే బతుకులు బాగు పడతాయని ముందు చూపు ఉన్న నాయకుడని కొనియాడారు.కుర్తి రావుల చెరువు గ్రామస్తులు, రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, నాయకులు నరసింహారెడ్డి, కిరణ్, వెంకట్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి ,నల్లా రెడ్డి, నాగన్న గౌడ్ ,గజేంద్రుడు రెడ్డి, లోకేష్ గౌడ్, కృష్ణ, నడీపిన్న ,చింతన్న, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపనకు ఏర్పాట్లు వాయిదా వేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఘణపురం మండలంలో ఘణపురం తో పాటు పెద్దమందడి రెండు మండలాలకు కలిపి షాపూర్ గ్రామ బస్సు స్టేజ్ కి సమీపంలో వ్యవసాయ మార్కెట్ శంకుస్థాపన కొరకు ఈ నెల 21 సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. తీరా మండల కేంద్రానికి చెందిన అధికార పార్టీ నాయకులు వ్యవసాయ మార్కెట్ ను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పై ఒత్తిడి తెచ్చారు. సమస్యను పరిష్కరించాలని మండలానికి చెందిన ఓ జిల్లా స్థాయి నాయకుడికి ఎమ్మెల్యే బాధ్యతలు అప్పజెప్పారు. ఆ నాయకుడు షాపూర్ సమీపంలోనే వ్యవసాయ మార్కెట్ శంకుస్థాపన చేపిద్దామని చెప్పడంతో అధికార పార్టీ మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు ఆ నాయకుడు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు చెప్పినట్టు నడుచుకోవాలంటే నడుచుకోలేమని ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం పనులు ఏర్పాటు చేయాలని గతంలో కూడా మండల కేంద్రాన్ని పలు అభివృద్ధి పనుల విషయంలో విస్మరించారని ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయ మార్కెట్ ఇక్కడ ఏర్పాటు చేయాలని నిలదీశారు. దీంతో ఆ నాయకుడు అక్కడి నుంచి అసహనంతో వెళ్లిపోయాడు. మండల ప్రజలు ఉత్తర ఘణపురం, దక్షిణ ఘణపురం గా విడిపోయారు. మానాజీపేట, సోలిపూర్ ,ఉప్పరపల్లి ,రుక్కనపల్లి ,షాపూర్ గ్రామాలకు చెందిన అధికార పార్టీ నాయకులు రాత్రికి రాత్రి ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లారు. మండల కేంద్రంలో వెంకటం పల్లి ,కమలుద్దిన్ పూర్ ,మామిడిమడ ,గ్రామాలకు చెందిన అధికార పార్టీ నాయకులు జెసిబి లు హిటాచి సహాయంతో చౌడమ్మ గట్టు సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని శంకుస్థాపన ఏర్పాటు కోసం చదును చేశారు. అందరూ కలిసి అర్ధరాత్రి వరకు వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేఘారెడ్డితో చర్చించారు. ఇరు వర్గాల వారు పట్టుపట్టడంతో శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో శంకుస్థాపన చేయాల్సి న వ్యవసాయ మార్కెటు ను వాయిదా వేశారు. దీంతో అధికార పార్టీ మండల కేంద్రానికి చెందిన కార్యకర్తలు నాయకులు వాయిదా వేయించిన సదరు నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ సిపిఐ ధర్నా




మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

**ఆత్మకూరు, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తక్షణమే ఆపాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శనివారం రోజు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ధర్నాను దేశించి సిపిఐ జిల్లాకార్యదర్శి విజయ రాములు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో పలు వెంచర్లు ఏర్పాటు చేసినప్పటికీ ప్రతి వెంచర్లో ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే కాకుండా అక్రమంగా విక్రయాలు కొనసాగించాలని అంతేకాకుండా ప్రస్తుతం తెలంగాణ గెజిటెడ్ కార్యాలయం పక్కన అక్రమంగా మాది ఎంపీపీ శ్రీనివాసులు నిర్మిస్తున్న నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగుల భవనం పక్కన నిర్మిస్తున్నటువంటి అక్రమ నిర్మాణం పూర్తిగా ప్రజలకు అవసరమయ్యే రోడ్డును కబ్జా చేసి నిర్మాణం కొనసాగిస్తున్న అటు మున్సిపల్ అధికారులు కానీ ఇటు ప్రజాప్రతినిధులు కానీ ఏమాత్రం అడ్డుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో నిర్మాణాలు ప్రారంభించిన సమయంలో సిపిఐ ఆధ్వర్యంలో అడ్డుకోగా ప్రస్తుతం అధికారులు అండదండలతో అక్రమ నిర్మాణం ఇదేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. బాబా కాలనీలో ఏర్పాటు చేసిన వెంచర్ లబ్ధిదారులకు ప్రస్తుత అక్రమ నిర్మాణ మూలంగా రోడ్డు పూర్తిగా మాయమైపోతుందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోష ,అబ్రహం ,భాస్కర్ ,రాబర్ట్, కుతుబ్ తదితరులతో పాటుగా పలువురు మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం



బ్రహ్మోత్సవాల గోడపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

**ఆత్మకూరు, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణ సమీపంలో వెలసినటువంటి శ్రీ చర్ల పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని జాతర నిర్వహణ కమిటీ సభ్యులు దివాన్జీ వెంకట నరసింహారావు కమిటీ సభ్యులు మనివర్ధన్ రెడ్డి తదితరులు అన్నారు. ఈ మేరకు శనివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహావరణలో చర్ల పరమేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల శివరాత్రి నుండి ప్రారంభం కానున్న పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే గతానికి భిన్నంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లుగా వారు తెలిపారు. ముఖ్యంగా జాతరకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్, మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగొండ శ్రీనివాసులు ,రామలక్ష్మారెడ్డి, నాగేష్, దామోదర్, వెంకటన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పిడిఎఫ్ బియ్యం పట్టివేత... ఒకరిపై కేసు నమోదు



అక్రమ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** చారకొండ మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పిడిఎఫ్ బియ్యం పట్టుకొని ఒకరిపై కేసు నమోదైన సంఘటన చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.... విశ్వసనీయ సమాచారం మేరకు సారంబండ తాండకు చెందిన స్లాబ్ నవీన్ అనే వ్యక్తి సారంబండ-గోకారం మార్గం మధ్యలో అక్రమ పిడిఎఫ్ బియ్యాన్ని 20 క్వింటాళ్లు లోడ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితుడి సమాచారం మేరకు చారకొండ గ్రామానికి చెందిన గుడిపాటి శారదమ్మ ఇంట్లో సోదాలు నిర్వహించగా 20 క్వింటాల పిడిఎఫ్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. నిందితుడు ఇస్లావత్ నవీన్ వద్ద పట్టుపడ్డ 15 క్వింటాళ్ల బియ్యం, పానుగంటి గుడిపాటి శారదమ్మ ఇంట్లో 20 క్వింటాళ్ల బియ్యంని స్వాధీనం చేసుకుని చారకొండ మండలం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా సరఫరా చేస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసిన, విక్రయించిన, కొనుగోలు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్మెంట్ సిబ్బందితో పాటు హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభమేళ జలంతో ఆలయంలో అభిషేకాలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

**అడ్డాకుల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కన్మనూరు గ్రామంలో పవిత్రమైన కుంభమేళ జలంతో శనివారం ఆలయాలలోని ప్రధాన మూర్తులలో పాటు గ్రామదేవతలకు మహా కుంభమేళ జలంతో అభిషేకం నిర్వహించారు. గ్రామ పురోహితులు వీరశైవాగమ విద్వన్మని శివశ్రీ సురేష్ శాస్త్రి ప్రయాగరాజ్ పుణ్య క్షేత్రం త్రివేణి సంగమంలో 144 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న మహా కుంభమేళకువెళ్లి పుణ్యస్నానాన్ని ఆచరించి ఆ త్రివేణి సంగమం అమృతభిందూఫల జలాన్ని గంగా పూజ నిర్వహించి తీసుకొనివచ్చి గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ చంద్రమోలేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి గ్రామంలోని శ్రీ కురుమూర్తి స్వామి దీప స్థంభం, శ్రీ బీచుపల్లి ఆంజనేయస్వామి దీప స్థంభం శ్రీ సింగోటం లక్ష్మినరసింహస్వామి దీప స్తంభాలతో పాటు గ్రామదేవతలు శ్రీ నాభిశిలా దేవత, మైసమ్మ దేవత, పోషమ్మ దేవత, ఉరడమ్మతల్లి, దేవతలకు ఆ పవిత్రమైన కుంభమేళ జలముతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు పాల్గొని పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పురోహితులు సురేష్ శాస్త్రి మాట్లాడుతూ కార్యక్రమం ముఖ్య సంకల్పం గ్రామంలోని ప్రజలందరికీ కూడా సంపూర్ణ ఆరోగ్యము, ఆయుష్షు ధనము, ధాన్యం సుఖము, సంతోషాలతో వర్ధిల్లుతూ, గ్రామమంత కూడా సస్యశ్యామలంగా, పాడిపంటలతో అభివృద్ధి జరగాలని ఈ అభిషేక సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

## గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

**నవాబుపేట, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇప్పటూరు గ్రామంలో గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి అపహరించారు. పంచాయతీ పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇలా పలు గ్రామాల్లో ప్రభుత్వ పరికరాలు అక్కడక్కడ చోరీకి గురైన సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. గ్రామపంచాయతీలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రత్యేకంగా ప్రజల భద్రతకు కూడా సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## మార్చి 25న ప్రాంతీయ పోస్టల్ పెన్షన్ అదాలత్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** వచ్చే నెల మార్చి 25న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ ప్రాంతీయ పోస్టల్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ వచ్చే నెల 20వ తేదీ అని తెలిపారు. హైదరాబాద్ ప్రాంతం పోస్టల్ ఉద్యోగుల పెన్షన్ విషయాలకు సంబంధించిన ఫిర్యాదులను ది అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్ట్ మాస్టర్ జనరల్, హైదరాబాద్ రీజియన్, హైద్రాబాద్ 1 తెలంగాణ సర్కిల్ డాక్ సదన్, 5వ అంతస్తు, ఆబిడ్స్, హైదరాబాద్ 500001 అనే చిరునామాకు పోస్ట్ ద్వారా పంపవచ్చునని ఆమె తెలిపారు.

## కార్మికుని కుటుంబానికి అండగా నిలిచిన తోటి కార్మికులు



పంచాయతీ కార్మికునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** వెల్దండ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు చిన్నయ్య మృతి చెందారు. తోటి పంచాయతీ పారిశుద్ధ కార్మికులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు లక్ష్మినారాయణ, యాదయ్య, బుజ్జయ్య, మహిపాల్‌నాయక్, పరమేష్, నరేష్, విమలనాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఘనంగా మౌలాన అబ్దుల్ కలాం వర్ధంతి

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** స్వతంత్ర సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలాన అబ్దుల్ కలాం ఆజాద్‌కి ఎంఐఎంనాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఎంఐఎం పార్టీ జిల్లాఅధ్యక్షుడు మున్నాభాష ఆదేశానుసారం,మండల అధ్యక్షుడు ఎండిరఫీ ఆధ్వర్యంలో రాజీవ్ మార్గంలో ఉన్న మౌలాన అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లాజాయింట్ సెక్రెటరీ షర్ఫుద్దీన్,షఫీ, మండల సెక్రెటరీ సమీ,వెల్దర్ మండల జాయింట్ సెక్రెటరీ మజీద్, ఏ అన్వర్ ,అధ్యక్షులు ఫరూక్ పాషా, ఎస్ కే షైజాద్.షఫీ, సమీ, నదీమ్, అస్లాం, అబ్దుల్ రహిమాన్, తదిత రులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**తెలకపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎస్.ఆర్ పాఠశాలలో శనివారం ఒకరోజు విద్యార్థులే ఉపాధ్యాయులుగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థి ప్రిన్సిపల్ సెక్రటరీగా గౌతమ్, డీఎస్పీగా శివ, ఆర్జెడిగా చేతల్, డీఈవోగా గణేష్, ఎంఈఓగా సహస్ర, కర స్పాండెంట్‌గా జాహ్నవి, ప్రిన్సిపాల్ సిద్ధార్థ, వైస్ ప్రిన్సిపాల్ రేహాన్ తాఫిక్ వీరితో పాటుగా 46మంది విద్యార్థి ఉపాధ్యాయులు బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉపాధ్యాయులు మాట్లాడుతూ మేము ఒకరోజు ఉపాధ్యాయులుగా బోధన నిర్వహించడం ఎంతో సంతోషం కలిగిందని, ఈరోజు మా ఉపాధ్యాయులు మాకు విద్యా బోధనలను అందించడం ఎంత కష్టమో అని మేము ఒక్కరోజులోనే చూశామని అన్నారు. అనంతరం చక్కగా బోధించిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులను అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొరటికల్‌లో ఇరుముడితో పాదయాత్ర చేస్తున్న శివ స్వాములు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన శివ స్వాములు శనివారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. ఇరుముడి కార్యక్రమం గురు స్వాములు గణేష్, పర్వతాలు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివస్వాముల ఇరుముడితో డప్పులతో ఊరేగింపు చేపట్టి అనంతరం శ్రీశైలం శివయ్యను దర్శించుకునేందుకు పాదయాత్ర ప్రారంభించారు.

## ధన్వాడ పాఠశాలకు ప్రింటర్ వితరణ

**ధన్వాడ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఎఫ్‌ఎల్‌ఎన్ ధన్వాడ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న రాకాసుల గుట్ట ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనపటి మల్లిఖార్జున్, ధన్వాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు రూ.20000/ విలువైన ప్రింటర్, పేపర్ బండిల్స్‌ను పాఠశాల హెడ్మాస్టర్ ఎం.నరసింహ చారికి వితరణ చేయడం జరిగింది. ఈ వితరణ కార్యక్రమంలో మండల విద్యాధికారిణి గాయత్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కొండాపూర్ కాంప్లెక్స్ జిహెచ్‌ఎం శంకరయ్య, తపస్ ధన్వాడ మండల అధ్యక్షులు సురేష్ బాబు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## అందుబాటులో యూరియా

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండలంలోని రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉన్నదని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ తెలిపారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల సింగిల్ విండో కార్యాలయం, ఆగ్రో రైతు సేవా కేంద్రంలో (యూరియా 125 ఎం టి ఎస్) అందుబాటులో ఉందని కావాల్సిన రైతులు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ తెలిపారు.

## దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ కృషి

**మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి**

**డిసిసి కార్యాలయంలో మౌలానా వర్ధంతి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** భారత ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ దేశంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ ఫయాజ్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ అబుల్‌కలామ్ ఆజాద్ ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణలు చాలా గొప్పవని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ దేశంలో అనేక విద్యాసంస్థల రూపకల్పనలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ తన వంతు పాత్ర పోషించారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్, నాయకులు పక్రుద్దీన్ ఖురేషి, మహ్మద్ జహీర్, పీర్ సాధిక్, షాఫైసల్, మహ్మద్ అక్బర్, మహ్మద్ ఫహీం, జమీల్, రఫీ, వహీద్, సునీల్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాంచంద్ర, మొయిజ్, బాసిత్, అలీ పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం ఘనంగా స్వయం పరిపాలన దినో త్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా ర్థులే ఉపాధ్యాయు లుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు ఛాత్రో పాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలను అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పాఠశాల హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులందరూ మంచిగా చదువుకొని, ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటపోలు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, పోల శ్రీధర్, పోకల సతీష్, చంద్రశేఖర్, కల్పన, శ్యాం సుందర్ గౌడ్, అజ్మ తుల్లా, లక్ష్మణ్, శ్రీనివాసులు, గోపి, మల్లారెడ్డి, శ్యామలగౌరి, విజయ, రాజ వర్ధన్ రెడ్డి, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేర్‌లో మామిడి ఇంటిగ్రేటెడ్, సేకరణ కేంద్రం ఏర్పాటు చేయండి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన యువజన కాంగ్రెస్**

**పెబ్బేరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా వనపర్తి జిల్లాలో పెబ్బేరు మండల కేంద్రం ప్రాంతంలో మామిడి రైతులు బారి స్థాయిలో సాగు చేస్తూ నాణ్యమైన ఉత్పత్తిని అందిస్తున్నారు. సరైన మద్దతు ధర మార్కెటింగ్ నిల్వ సదుపాయాలు లేనందున రైతులకు నష్టాలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి పెబ్బేరు మండల కేంద్రంలో ప్రత్యేక మామిడి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు యువజన కాంగ్రెస్ తరఫున వినతి పత్రం ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్ మామిడి ని శుద్ధి, ర్యాంకింగ్ ,గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేయడానికి అలాగే ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా ప్యాకింగ్ చేయడానికి మామిడి సేకరణ కేంద్రం రైతులు నేరుగా తమ ఉత్పత్తిని విక్రయించేలా సౌకర్యం కల్పించేందుకు మధ్యవర్తులపై ఆధారపడకుండా మంచి ధరలు పొందేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అసెంబ్లీ కన్వీనర్ సాయి రెడ్డి, టి ఏం ఆర్ శివ, సుగురు శివ యాదవ్, పెబ్బేరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎం రాజేష్ ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**పెబ్బేరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ గ్రామర్ స్కూల్ (పాఠశాల)లో స్వ యం పరిపాలన దినోత్స వాన్ని ఘనంగా నిర్వహిం చడం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులలో కలెక్టరు గా జీ.తరుణ్ కుమార్ రెడ్డి, డీఈఓ గా పూజిత, డిప్యూటీ డిఈఓగా షణ్ముఖి, ఎంఈఓ ఇందు, ప్రిన్సిపాల్‌గా నందిని, హెడ్మాస్టర్‌గా సాయికుమార్, టిఈటిలుగా వివిధ విద్యా ర్థిని, విద్యార్థులు పాల్గొని, బావి భారత పౌరులుగా తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులేనని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఈ కార్యక్రమంలో పాల్గొనటువంటి పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతి మేడం విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. పాఠశాల ప్రధాన సలహాదారులు వెంకట య్యసార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చక్కని క్రమశిక్షణను అలవర్చుకోవాలని రాబోయే పదవతరగతి వార్షికపరీక్షలలో అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి తల్లిదండ్రులకు ఉపాధ్యాయ బృందానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడము జరిగింది.

## శ్రీశైలం నీటి ముప్పు నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించండి

**పెబ్బేరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలో వ్యవసాయ మార్కెట్ గోదాంల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితులు విడివిడిగా వినతిపత్రం అందజేశారు. అనంతరం నిర్వాసితుల మాట్లాడుతూ శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు నీటి ముంపు నిర్వాసితులకు జీఓ నెంబర్ 98, జీఓ నెంబర్ 68 ప్రకారం ప్రాజెక్టు నిర్వాసిత ఉద్యోగుల జాబితాను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ చేయించి రాష్ట్ర ప్రభుత్వా అన్ని శాఖలలో శ్రీశైలం విద్యుత్ ప్రాజెక్టు నీటి ముంపు నిర్వాసితులను వెంటనే ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాగోజి రావు, గుమ్మడి శేఖర్, చంద్రశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కకు మద్దూర్ నుంచి బయలుదేరి వెళ్లిన ఎక్బాల్

**మద్దూర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రం నుంచి శనివారం సీనియర్ రిపోర్టర్ అంజయ్య ఆయన స్వగృహంలో మ క్కాకు బయలుదేరి వెళుతున్న ఎక్బాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్స రం మద్దూర్ నుంచి మన మిత్రులు ఎవ రో ఒక్కరు పవిత్ర క్షేత్రమైన మక్కాకు బయలుదేరి వెళ్లడంతో ఎంతో సంతోషంగా ఉందని సాక్షి రిపోర్టర్ అంజయ్య అన్నారు. ఈ కార్యక్ర మానికి మద్దూర్ పట్టణకేంద్రం చెందిన ముస్లింమతస్తులు ఆశీర్వదించి పంపించారు. ఈ కార్యక్ర మంలో మద్దూర్ జర్నలిస్టులు విజయచారి, షబ్బీర్, షఫీ , అతిక్, వెంకటేష్, కేశవ్ పాల్గొన్నారు.



ఎక్బాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను సన్మానించిన ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం



మంత్రులు, ఎంపిలు,ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 22 ప్రభాత వార్త :** పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవానికి ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర సాహకార శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వంరావు, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ,డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి లను కొత్తకోట మండల కేంద్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే 900 పైబడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం ఈనెల 14వ తేదీన ముగియనుండగా, రైతులకు ప్రస్తుతం జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అంతరాయం కలగకుండా సింగిల్ విండో, డీసీసీబీ, టెస్కాబ్‌ల పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారిని గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహకార శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ,సంక్షేమ పథకాలు రైతులకు అందే విధంగా సింగిల్ విండోలు సమర్థవంతంగా పని చేయాలని ఆ ఉద్దేశంతోనే మీ పదవీకాలం మరో ఆరు నెలల పాటు పొడిగించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ ఫోరం అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పోతుల మధుసూదన్ రెడ్డి, పాలెం సుదర్శన్ గౌడ్, డిసిసిబి వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, వెంకటేష్ గుప్తా, వంశీచంద్ రెడ్డి, ఫోరం నాయకులు అశోక్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రఘు, ఆయా జిల్లాల సింగిల్ విండో అధ్యక్షులు పాల్గొన్నారు.

## పల్లె దవఖానలో మెగా హెల్త్ క్యాంప్

**బిజినేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** గంగారం గ్రామం లో శనివారం సంపూర్ణ సురక్ష కేంద్రం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నాగర్ కర్నూల్, లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. ప్రసన్న ఆధ్వర్యంలో గంగారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆవరణలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈశిబిరంలో గంగారం, పరిసర తాండల ప్రజలు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 142 మందికి హెచ్.ఐ.వి, హెపటైటిస్ బి , హెపటైటిస్ సి , సిఫిలిస్ వ్యాధుల స్క్రీనింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. జీవనశైలి వ్యాధులైన రక్త పోటు మధుమేహ స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించారు. లట్టుపల్లి వైద్యాధికారి డా. ప్రసన్న మాట్లాడుతూ అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ హెచ్ఐవి స్క్రీనింగ్ రక్త పరీక్ష నిర్వహించుకుని తాము హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నుండి సంపూర్ణ సురక్షితంగా ఉన్నామని తెలుసుకోవాలన్నారు. హెచ్ఐవి వ్యాధి నివారణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజలకు అవగాహన కలిగించారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపరాదని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రమేష్, ఎంఎల్‌హెచ్‌పి డా. తేజస్విని, ఎ.ఎన్.ఎం విజయలక్ష్మి, ఐటీసీ కౌన్సిలర్ బంగారయ్య, ఆశా కార్యకర్తలు నాగజాత, జయమ్మ, సుజాత, వసంత, ఎస్ఎస్‌కె సంస్థ ఆంజనేయులు, శివకుమార్ పాల్గొన్నారు.

## నాల్సా న్యాయ సందేశాలపై అవగాహన సదస్సు

**ప్రజలు న్యాయపరమైన చట్టెలపై అవగాహన కలిగి ఉండాలి**



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మునవర్ హుస్సేన్

**నవాబుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) అధికారుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో చట్టాలపై లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలను అందించడానికి, చట్టాలు, న్యాయ సంబంధిత విషయాలపై అవగాహన కల్పించేందుకు వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లను నిర్వహించడానికి రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మహబూబ్‌నగర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ స్పెషల్ మొబైల్ కోర్టు కం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మునవర్ హుస్సేన్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ లీగల్ సర్వీసెస్ టు సీనియర్ సిటిజన్ ఆక్ట్ గురించి మాట్లాడారు. పేద ప్రజలకు గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు వుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మహబూబ్‌నగర్‌ను సంప్రదించి న్యాయ సహాయం పొందవచ్చని తెలియజేశారు. సలహాలు,సూచనలు ఇచ్చారు మహిళలకు సంభందించిన చట్టాల గురించి మాట్లాడారు. అలాగే వచ్చే నెల మార్చి 8నాడు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియ చేసినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ యోగేశ్వర్ రాజ్ యాదవ్ వై.రవి కుమార్ యాదవ్, సీనియర్ న్యాయవాది సి.రామకృష్ణ గౌడ్, న్యాయవాది సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, విక్రమ్ చంద్రశేఖర్, పంచాయతీ మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## సింథటిక్ కెమికల్‌కు అనుమతులు వద్దు



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** కాలుష్య కారక చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని గత మూడు సంవత్సరాలుగా రైతులు చేస్తున్న ప్రభుత్వాలు ఆ ఉద్యమాన్ని లాఠీచార్జి, అక్రమ కేసులతో జైలు నిర్బంధాలతో అణిచివేశారని టిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.యాదగిరి తెలిపారు. ఆ కంపెనీలోనే ప్రమాదకరమైన తొమ్మిది రకాల సింథటిక్ కెమికల్స్‌ను ఏర్పాటు చేయడం కోసం కంపెనీ యజమాన్యం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిని నిరసిస్తూ సింథటిక్ కెమికల్స్‌కు అనుమతులు ఇవ్వవద్దని, ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలనిఈనెల 24న చిన్న చింతకుంట మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ధర్నాను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే ఈ కంపెనీ రద్దు చేస్తామని బహిరంగంగానే ప్రకటించి మద్దతు తెలిపిన వాళ్లే ఎమ్మెల్యేలయ్యారని, రద్దు చేయాలని ఉద్యమించిన ప్రజలు, రైతులు రౌడీ షీటర్లగా ఎట్లా అవుతారని స్థానిక ఎమ్మెల్యేలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రైతు ప్రభుత్వం అని చెబుతూ కోయిల్ సాగర్ నుండి 52 వేల ఎకరాల వ్యవసాయానికి ఇవ్వాల్సిన నీటిని ఇథనాల్ కంపెనీకి ఎట్ల తరలిస్తారని స్థానిక ఎమ్మెల్యేలను ఆయన ప్రశ్నించారు అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు పోరాట కమిటీ, టిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి యాదగిరి, యు.రామచంద్రయ్య, బండారి మల్లేష్, మధు, బిక్షపతి, అలీసాబ్ తదితరులు పాల్గొన్నారు.

## గంప జాతర



గంపజాతరకు తరలివస్తున్న భక్తులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** జడ్చర్లలోని గంగాపురంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవ దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్స వాలు వైభవంగా ముగిసాయి. బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత వచ్చే రెండవ శనివారం స్వామివారికి భక్తులు గంప జాతర నిర్వహిస్తారు. ఈ క్రమంలో శనివారం స్వామివారి గంప జాతరను శనివారం నిర్వహించారు. ఈ గంపజాతరకు చుట్టు పక్కల మండలాల నుంచి వచ్చే భక్తులు ఉపవాసదీక్ష చేస్తూ స్వామివారిని దర్శించుకుని స్వామివారి ప్రసాదం స్వీకరించి ఉపవాస దీక్షను విరమిస్తారు.

## దేవాలయంలో విద్యుత్ జీఎం పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విద్యుత్ జీఎం

**వెల్దండ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** దక్షిణ కాశిగా విరజిల్లుతున్న గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం రాష్ట్ర విద్యుత్తు జీఎం నాగ తులసి నాగరాణి సందర్శించి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జీఎంను శాలువాలతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందించారు. ఆలయ విశిష్టత గురించి అర్చకులు జీఎంకు వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రాఘవేందర్ గౌడ్, నాగేష్, ఆలయ అర్చకులు సంతోష శర్మ, నరహరి శర్మ, సురేష్ శర్మతో పాటు తదితరులు ఉన్నారు.

## మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాలయాలకు సిమెంట్ బెంచిలు వితరణ



సిమెంట్ బెంచీలు బహుకరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు, జూనియర్ కళాశాలకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచిలు వితరణ చేసినట్లు మిత్ర ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు కుడుముల చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, దేవాలయల వద్ద ప్రజలు సేద తీరడానికి మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచిలు వితరణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు సభ్యులు పాల్గొన్నారు.

## మౌలాన అబ్దుల్ కలాంకు నివాళులు

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** స్వాతంత్ర సమర యోధుడు, భారత రత్నభారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలాన అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు న్యాయవాది కొండాపురం షఫీ ఉల్లా ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ యూసుఫ్, సనా ఉల్లా, ఇక్బాల్, ముజాహిద్, బాబా ఆమ్టే తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు షఫీ ఉల్లా

## ఉమా మహేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**- శివ స్వాములకు అన్నప్రసాదం ఏర్పాటు - 21 ఏళ్ళుగా అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే**



మహాశివునికి అభిషేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



శివ స్వాములకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

**అచ్చంపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం పాదయాత్రగా వెళ్ళే శివస్వాములు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన తన సతీమణి శారదరెడ్డితో కలిసి ప్రారంభించారు. గత 21 ఏళ్ళుగా అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శివునికి అందించే నైవేద్యంగా భావించి ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉమామహేశ్వరం మీదుగా శ్రీశైలం వెళ్ళే భక్తులు సేవా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు బగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు కుంకుమార్చణ, అభిషేక పూజలు నిర్వహించారు. వినాయకుడు, మహిషాసుర మర్దిని, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఛైర్మన్ బీరం మాధవ రెడ్డి, సభ్యుడు పవన్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య శాస్త్రి ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఆలయాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం అన్నదాన శిబిరాన్ని భక్తుల శివ నామ స్మరణ నడుమ ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనుచరులు, ఇతర నేతలు పాల్గొన్నారు.



శివ స్వాములకు ఫలధానం అందజేస్తున్న శివ సన్నిధి సేవాసమితి సభ్యులు

**శివ స్వాములకు పండ్ల పంపిణీ**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** : శివ సన్నిధి సేవాసమితి అచ్చంపేట వారి ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే స్వాములకు శనివారం పండ్లు, మంచి నీరు, మందులు, వసతి సౌకర్యం కల్పించారు. శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న శివ స్వాములకు నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని వటువర్లపల్లి గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో గత 13 సంవత్సరాలుగా శివ సందిని సేవాసమితి అచ్చంపేట వారు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా ఈ సంవత్సరం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం వెళ్లే శివ స్వాములకు, భక్తులకు ఫలధానం తో పాటు వసతి సౌకర్యం కల్పించారు. శివ రాత్రి పర్వదినం పురస్కరించుకొని శివయ్యను దర్శించుకోవడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో శివ స్వాములు వందల కిలోమీటర్ల నుంచి పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలం వెళ్లి శివయ్యను దర్శించుకుంటారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పాదయాత్ర చేస్తున్న శివ స్వాములకు సౌకర్యాలు కల్పించడమే సేవా సమితి వారి లక్ష్యంగా పనిచేస్తున్నామని సేవాసమితి నిర్వాహకులు పేర్కొన్నారు. పాదయాత్ర చేస్తున్న ప్రాంతంలో తాగునీరు ఇబ్బంది లేకుండా చూసుకోవడం, మొబైల్ ఛార్జింగ్‌లు పెట్టే సౌకర్యం, సుదూర ప్రాంతాల నుంచి పాదయాత్ర చేస్తుండడంతో వారికి కావలసిన వైద్య సేవలు అందించేందుకు సేవా సమితి విశేష కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి సురేష్, మహేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, జ్ఞానేష్, వెంకటేష్, కిషన్ రావు, ఋషికేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో....** శ్రీశైలం శివయ్యను దర్శించుకునేందుకు శివ స్వాములు పాదయాత్రతో వెళ్తున్న వారికి అచ్చంపేట పట్టణంలోని మైనార్టీ సోదరులు కుల, మతాలకు అతీతంగా సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అచ్చంపేట ముస్లిం సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే శివ స్వాములకు పండ్లను పంపిణీ చేశారు.

**ఘనంగా శివ స్వాముల ఇరుముడి మహోత్సవం**

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల్ కంబలపురం గ్రా మం లో శ్రీ రామాంజనేయ స్వామిగుడి దగ్గర శివ స్వాముల ఇరుముడి మహోత్సవం నిర్వ హించడం జరిగిం ది. 13 మంది శివ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకుని శివస్వా ములు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఈకార్యక్రమంలో కంబాలపురం గ్రామ ప్రజలు, శివ స్వాముల బంధువులు, శివ భక్తులు పాల్గొనడం జరిగింది.



ఇరుముడులతో శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు

**భక్తి శ్రద్ధలతో ఇరుముడి పూజలు**

**వెల్దండ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంతో పాటు కుప్పగండ్ల, పెద్దాపూర్ గ్రామాలలో శివ మాల ధరించిన స్వాములు శనివారం దేవాలయాలలో శివ స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమం నిర్వహించారు. శివుడికి అభిషేకాలు నిర్వహించి మంగళ హారతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివ మాలదారులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరగా ఊరేగింపుగా స్వాములను మంగళహారతులతో శ్రీశైల పుణ్యక్షేత్రానికి సాగనంపారు.



కుప్పగండ్ల గ్రామంలో ఇరుముడి కార్యక్రమంలో శివస్వాములు

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం

మొదటి పేజీ తరువాయి భాగం..



సమీక్షిస్తున్న ఎంపీ మల్లురవి

డి.జి నారాయణ రావు ఆధ్వర్యంలో రీస్క్యూ టీం పనిచేస్తుండగా ఐ.జి సత్యనారాయణ ఆధ్వ ర్యంలో పోలీస్ బృందాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయా న్నారు. ఇప్పటికే వైద్య బృందం అంబులెన్స్‌లను సిద్దంగా ఉంచామ న్నారు. నీటిపారుదల శాఖాధికా రులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వారిని కాపాడేందుకు చేపడుతున్న చర్యలను పర్యవేక్షిస్తున్నా మన్నారు. అయితే వెంటిలేషన్ కు ఇబ్బంది లేదన్నారు. టన్నెల్ తవ్వ కంలో రాబిన్ సంస్థ ప్రపంచ స్థాయిలో పేరెన్నికగన్నదన్నారులోపట చిక్కుకున్న ఆ ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడడమే ప్రభుత్వం ముందున్న సవాల్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న ఆ ఎనిమిది మందిలో ప్రాజెక్ట్ ఇంజినీర్,సైట్ ఇంజినీర్‌తో పాటు ఇద్దరు మిషన్ ఆపరేటర్లు, నలుగురు వర్కర్లు ఉన్నా రని ఆయన వివరించారువారి వివరాలను ఆయన మీడియా కందిం చారు.

**టన్నెల్‌లో చిక్కుకున్న వారి వివరాలు..**

1.మనోజ్ కుమార్ (పీఈ) ఉత్తర ప్రదేశ్, 2.శ్రీనివాస్ (ఎఫ్ఈ) ఉత్తర ప్రదేశ్
3.సందీప్ సాహు (కార్మికుడు)జార్ఖండ్, 4.జటాక్స్ (కార్మికుడు)జార్ఖండ్
5.సంతోష్ సాహు (కార్మికుడు)జార్ఖండ్, 6.అనూజ్ సాహు (కార్మికుడు)జార్ఖండ్
7.సన్నీ సింగ్ (కార్మికుడు)జమ్మూ కాశ్మీర్, 8.గుర్‌ప్రీత్ సింగ్ (కార్మికుడు)పంజాబ్

**అసలేం జరిగింది..** టన్నెల్ తవ్వకాలు మొదలు పెట్టిన ఏజెన్సీ నిర్వాహకులు చెప్పే కథనం ప్రకారం అకస్మాత్తుగా లోపటికి నీరు,మట్టి 8 కిలోమీటర్ల మేర రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని భావించాల్సి ఉందన్నారు. రోజువారీగా పని మొదలు పెట్టినట్లే ఈ ఉదయం 8 గంటలకు పని మొదలు పెట్టిన 30 నిమిషాలలోనే ఈ సంఘటన ఉత్పన్నమోడంతో వెంటనే నిర్వాహకులు పనిని నిలిపి వేసి బయటకు రావడంతో పాటు వీలున్నంత వరకు సిబ్బందిని బయటకు తీసుకొచ్చారన్నారు. ఏదైతే టన్నెల్ బోర్ మిషన్ టీబీఎం, వద్ద పని మొదలు పెట్టారో అక్కడికి నీరు,మట్టి చేరుతుండడంతో పాటు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మిషన్ మీద ఉన్న వారు,వెనుక భాగంలో ఉన్న వారు బయటకు రాగలిగారని, మిషన్ ముందు భాగంలో ఉన్న వారు అందులో చిక్కుకున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ ప్రమాదంపై ఎస్పీ వైభవ్ గైక్వాడ్ స్పందించారు. ప్రమాద సమయంలో 50మంది కార్మికులు ఉన్నారని, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపారు. గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

## మంత్రుల సమీక్ష..

**- ఎప్పటికప్పుడు సహాయక చర్యలపై ఆరా..**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమగట్టు కాలువ ప్రమాదం స్థలికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు హుటాహుటిన చేరుకున్నారు. దోమలపెంటలోని జె.పి గెస్ట్ హౌస్‌లో ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు.సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖా సలహాదారు ఆదిత్య దాస్ నాథ్,ఐ.జి సత్యనారాయణ,అగ్నిమాపక డి.జి జి.వి నారాయణ రావు,నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఎస్ఎల్‌బిసి పనులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రులు ఉత్తమ్,జూపల్లి క్షతగాత్రుల వివరాలు,వారి ఆరోగ్య పరిస్థితిపై మంత్రులు ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలంటూ అధికారులకు ఆదేశించారు. సొరంగం లోపల చిక్కుకున్నారని భావిస్తున్న వారిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచారు. అగ్నిమాపక సిబ్బంది, రిస్క్యూ టీం లు ఇప్పటికే రంగంలోకి దిగాయి. సంఘటనా స్థలిలో ఉంటూ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,జూపల్లి కృష్ణారావు ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అనంతరం సాయంత్రం ఎంపీ మల్లురవి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అధికారులతో ఘటనకు సంబంధించిన వివరాలు ఆరా తీశారు. ఆర్మీని ఉపయోగించుకొని అయినా సరే సిబ్బందిని సురక్షితంగా కాపాడుతామని స్పష్టం చేశారు.

## టన్నెల్ ప్రమాదంపై ఎంపీ డీకే ఆరా

**మబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 22, ప్రభావార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై ఎంపీ డికె.అరుణ ఆరా తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 14వ కిలోమీటరు వద్ద ప్రమాదం జరిగినట్లు తెలసిందన్నారు. అధికారులు, సిబ్బది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రెస్క్యూ పనులపైన ఆరా తీశారు. క్షత గాత్రులకు మెరుగైన చికిత్సలు అందించాలని అధికారులకు ఆదేశించారు. టన్నెల్‌లో చిక్కుకున్న సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకురావాలిని ఆదేశించారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను రక్షించే చర్యలు వేగవంతం చేయాలని అవసరమైతే ఆర్మీ సహాయక చర్యలు ఉపయోగించుకోవాలని సూచించారు.

## అగ్రికల్చర్ డిప్లొమా చదవకుండా నకిలీ సర్టిఫికెట్స్‌లతో వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నకిలీది అని, అట్టి కాలేజి నందు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లేదని కమీషనర్ అండ్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్, తెలంగాణా ప్రభుత్వానికి తెలిపినట్లు తెలిసినదన్నారు. సదరు కాట్రవత్ నరేష్ నకిలీ సర్టిఫికేట్ సమర్పించి ఉద్యోగమూ లో చేరి తేది 28.01.2017 నుండి 31.12.2023 వరకు ప్రభుత్వమును మోసము చేసి జీతము తీసుకున్నాడన్నారు. నరేష్ తేది 01.01.2024 నాడు జాబు కు రాజీనామా చేశాడని ఈ విషయం పై సిహెచ్ సంగీతలక్ష్మి ఎమ్మెస్సీ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గద్వాల వారు గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ నందు తేదీ 15.03.2024 న దరఖాస్తు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేయగా, నరేష్ తో పాటు, జగదీష్, శివ శంకర్, రవీందర్, జెరూపుల డాక్య మరికొంతమంది ప్రిన్సిపాల్ బాలకృష్ణ కు డబ్బులు చెల్లించి డిప్లొమా చదువకుండా చదివినట్లు నకిలీ సర్టిఫికేట్స్ పొంది వాటి ద్వారా ఉద్యోగాలు పొందినారని, కొంత మంది వాటి ద్వారా ఎగ్జామ్స్ రాసినట్లు తెలిసిందని తేదీ 21.02.2025 న నేరస్తులు అయిన నరేష్ ను పిజెపి క్యాంప్ గద్వాల దగ్గర, నాగరాజు ను అతని గ్రామంలో అదుపులోకి తీసుకొని వారి నుండి నకిలీ అగ్రికల్చర్ డిప్లొమా సర్టిఫికెట్స్‌లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసామన్నారు. ఇందుకు సంబందించిన మిగతా వారిని పట్టుకొని తరువాత వివరములు తెలియజేస్తాము అని అన్నారు. అగ్రికల్చర్ డిప్లొమా నకిలీ సర్టిఫికెట్లను పొందడానికి ఒక్కొక్క ధ్రువపత్రనికి 90 వేల నుండి 1,20,000 వేల రూపాయలు పెట్టి నిందితులు కొనుగోలు చేసినట్లు డి.ఎస్.పి మొగులయ్య మీడియా ముందు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ లోని, పరిదాపూర్, గాజీపూర్ యూనివర్సిటీ నుండి అగ్రికల్చర్ డిప్లొమా సర్టిఫికెట్లు పొందినట్లు నిర్ధారణకు రావడం జరిగిందని ఇందులో ప్రధానంగా ఉన్న వ్యక్తి నుంచి అన్ని కోణాలలో దర్యాప్తు చేసి మిగతా నకిలీ సర్టిఫికెట్లు పొందిన వారిని కూడా త్వరలో పట్టుకుంటామని విచారణ అనంతరం పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని గద్వాల డిఎస్పి మొగులయ్య అన్నారు. మీడియా సమావేశం అనంతరం నిందుతులను మీడియా ముందు ప్రవేశపెట్టారు గద్వాల పోలీసులు. ఈ కార్యక్రమంలో డిఎస్పి వై.మొగులయ్యతో పాటు గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరు శ్రీను, గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ రావు తదితరులు ఉన్నారు.

## వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు రూపొందించాలి : జిల్లా కలెక్టర్ సంతోష్



అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా జిల్లా వ్యాప్తంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో మండలాల వారీగా త్రాగునీటి సరఫరా పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయితీల్లో,మున్సిపల్ పరిధిలో నీటి సరఫరాను మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎక్కడైనా నీటికొరత ఏర్పడినట్లయితే,తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నిరంతరం త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. జిల్లాలో త్రాగునీటి సరఫరా ప్రభావితంగా కొనసాగేలా బల్క్ వాటర్ సప్లై, ఓహెచ్ఎస్ఆర్, సింగిల్ ఫేజ్ చేతిపంపులు, ప్రైవేట్ బోర్ వెల్స్, ట్యాంకర్లు వంటి అన్ని మార్గాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. అదనంగా వ్యవసాయ బోర్ వెల్స్‌ను కూడా బ్యాకప్ ప్రణాళికగా సిద్ధం చేయాలాని పేర్కొన్నారు. పీడబ్ల్యూఎస్ మోటార్లు, పైప్‌లైన్లు పూర్తిగా పరిశీలించి, 15 రోజుల్లోగా అన్ని మరమ్మత్తులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు పరస్పర సమన్వయం తో నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు గ్రామాలకు పర్యటనలు నిర్వహించి, నీటి వసతులు, మౌలిక సదుపాయాలు, నీటి నాణ్యత, శుద్ధి (క్లోరినేషన్), రిజిస్టర్లు పరిశీలించాలన్నారు. క్షేత్ర స్థాయిలో స్వయంగా గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరా పరిస్థితిని పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మిషన్ భగీరథ ఎస్.ఈ వెంకటరమణ, ఈ.ఈ గ్రిడ్ పరమేశ్వరి, ఈ.ఈ ఇంట్రా శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నాయకులతో చీకటి సమావేశాలు

**అభివృద్ధి పనులను అడ్డుకోవడం అస్యాస్పదం**
**నాయకుల తీరు మారాలి**
**కడుపులో కత్తెర్లు అన్న సామెత చందంగా ఉండకూడదు**
**ప్రతిపక్ష నాయకులతో చీకటి సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నారు**
**అభివృద్ధి ఓర్వలేక కడుపుమంటతో కయ్యాలకు దిగుతున్నారు**
**వనపర్తి నియోజకవర్గం లో ఇప్పటివరకు 850 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టాం**
**గోపాల్‌పేట మండలం బుద్ధారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలో 40 ఏండ్ల రాజకీయ చరిత్ర కలిగిన కొందరు సీనియర్ నాయకుల తీరు మార్చుకుని వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని, కడుపులో కత్తెర్లు నోట్లో చక్కెర్లు అన్న చందంగా ఉండకూడదని, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు భూమి పూజలు నిర్వహించారన్నారు. దాదాపు 18 కోట్ల రూపాయల పనులకు వారు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేశారు. అనంతరం జాతీయ రహదారి బుగ్రవాగు స్టేజి నుంచి మోజెర్ల గ్రామానికి రహదారిపై వంతెనల నిర్మాణాలకు వారు భూమి పూజ చేశారు. అనంతరం పెద్దమందడి మండలానికి మంజూరైన పదివేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థం గల గోడ నిర్మాణాలకు వారు శంకుస్థాపన భూమి పూజలు నిర్వహించారు. పెబ్బేరు మండల కేంద్రంలో గోదాం నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. బుద్ధారం గండి పుల్కాపహాడ్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించే గోపాల్‌పేట, రేవల్లి ,ఏదుల మండలాలకు సంబంధించిన నూతన మార్కెట్ యార్డ్ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులను ఓర్వలేని కొందరు నాయకులు కడుపుమంటతో తనకు అడ్డు తగులుతున్నారని , చేతనైతే నియోజకవర్గ అభివృద్ధిలో పోటీ పడాలని ఆయన పేర్కొన్నారు. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నాయకులతో చీకటి సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఈ చీకటి సమావేశాల అంతరార్థం ఏమిటో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు గోపాల్పేట, రేవల్లి, ఏదుల మండలాలు నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డ్ పరిధిలోకి వస్తున్నాయని, అలాంటి సమస్యను పరిష్కరిస్తూ నేడు మూడు మండలాలకు కలిపి నూతన మార్కెట్ యార్డును మంజూరు చేయిస్తే కళ్ళు మండిన కొందరు నాయకులు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని పార్టీ బలోపేతానికి అది ఏ మాత్రం పనికిరాదని ఎమ్మెల్యే సూచించారు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో చర్చించి కేవలం మూడు రోజుల్లో మార్కెట్ యార్డుల నిర్మాణానికి గోదాముల నిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చామని, మరి ఇన్ని సంవత్సరాల నుంచి పార్టీలో కొనసాగుతూ వివిధ హోదాలలో ఉన్న నాయకులు ఈ మండలాలను ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు. వనపర్తి నియోజకవర్గం ఎవరి జాగీరు కాదని శాశ్వత రాజకీయాలు దేనిలోనూ పనికిరావని ఆయన పేర్కొన్నారు. ప్రజా దీవెనతో గెలుపొందిన మనము ప్రజలకు ఉపయోగకరమైన పనులను నిర్వహిస్తూ నియోజకవర్గ పెద్ద జీతగాడిలా పని చేయాలి తప్ప అజమాయిషి చెలాయించడం సరికానిదని ఆయన అన్నారు. మొదటి విడతగా మార్కెట్ యార్డుల నిర్మాణానికి ప్రభుత్వం పది పది కోట్ల రూపాయలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని చెప్పుకునే నాయకులు అభివృద్ధి పై చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. సీనియర్ మంత్రి నీతి నిజాయితీకి మారుపేరైన తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గానికి రావడం కొంతమందికి ఇష్టం లేకనే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎన్ని కుళ్ల కుతంత్రాలు చేసిన వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ శ్రీనివాస్ గౌడ్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. :

## మంత్రి తుమ్మలకు ఎద్దుల బండిని బహుకరించిన మాజీ సర్పంచ్ అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకి పెబ్బేరు మాజీ సర్పంచ్ అక్కి సుశీల శ్రీనివాస్‌గౌడ్,నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సమీక్షంలో ఎద్దుల బండిని బహుకరించారు.ఈకార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ కాశీ విశ్వనాథ అన్నపూర్ణేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూ మోతీ నగర్ 35వ వార్డులో శ్రీశ్రీశ్రీ కాశీ విశ్వనాథ అ న్నపూర్ణేశ్వర దేవాల యంలో ప్రథమ వార్షికో త్సవ వేడుకలు మొదటి రోజు శనివారం నిర్వహిం చిన పూజల్లో భాగంగా మొదటి పూజా కార్యక్రమం మహాగణపతి హోమం, నవగ్రహ హో మాలు వాస్తు పరుష హోమాలు క్షేత్రపాలకుల హోమాలు కాలభైరవ మూలమంత్ర హోమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ చాగంటి శ్రవణ్ కుమార్ పండితులు, వెంకటేశ్వం శర్మ గంగాపురం పవన్ కుమార్ శర్మ, రామకృష్ణ శర్మ, సాయి పవన్ కుమార్ శర్మ, రాఘవేంద్ర చార్య, నరేష్ శర్మ మొదలైన వేద పండితుల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ ఎన్. రుక్మిణి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాములు యాదవ్, రవికుమార్, యాదగిరి, నరసింహ రాజు,వార్డు సభ్యులు, కమిటి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**మద్దూర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని పిల్లి గుండు తండాకు చెందిన చిట్టి బాయి భర్త రవి నాయక్ (28)గురువారం నుంచి కనిపించడం లేదని సమాచారం. భర్త రవినాయక్‌తో గొడవపడి ఇంటిలో నుంచి వెళ్లిపోయిందని చిట్టిబాయి తండ్రివిస్లావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు.ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. చిట్టిబాయికి ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నారు.సమాచారం తెలిసినవారు మద్దూర్ ఎస్ఐకి సమాచారం అందించగలరని ఈనంబర్‌కు 8712670407 ఫోన్ చేసి తెలపాలని కోరారు.

## క్రిమిసంహారక మందు సేవించి యువకుని ఆత్మహత్య

**నవాబుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** రెండు కాళ్లకు బ్లడ్ ఇన్ఫెక్షన్ అయ్యి నడవలేని స్థితిలో ఉండి జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని చౌదూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య తండ్రి పకీరయ్య (22) గత రెండు సంవత్సరాల క్రితం నుండి తన రెండు కాళ్లలో రక్తం ఇన్ఫెక్షన్ కావడంతో రెండు కాళ్లు నడవలేని స్థితికి వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఆలోచనతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి పకీరయ్య హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం రాత్రి 8:30 గం.లకు డాక్టర్లు అప్పటికే చనిపోయాడని తెలిపారు. తండ్రి ఫకీరయ్య అనారోగ్యంతో విసుగుచెంది ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యా నిధికి పంచవటి భారీగా విరాళం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ విద్యానిధికి మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన పంచవటి విద్యాలయ యాజమాన్యం 5లక్షల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అందజేశారు.విద్యానిధికి చేయూత ఇస్తున్నందుకు పంచవటి విద్యాలయ యాజమాన్యానికి ఎమ్మెల్యేగారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రతి ఒక్కరూ విద్యానిధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం విద్యా నిధికి 5లక్షల రూపాయల చొప్పున విరాళం అందజేస్తామని పంచవటి విద్యాలయ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోహన్ రావు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయదారులకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పంట చేతికి వచ్చాక నేరుగా కంపెనీ వారే కొనుగోలు చేసుకుంటారని చెప్పారు. ప్రస్తుతం పామాయిల్ గెలలు మార్కెట్ లో టన్నుకు 20,487 రూపాయల ధర పలుకుతుందనీ త్వరలోనే 25 వేలకు చేరుకుంటుందని తెలియజేశారు. ఇప్పుడు భూమి పూజ చేస్తున్న పామాయిల్ కంపెనీ. ఆగష్టు 15 నాటికి ప్రారంభోత్సవం చేస్తామని అదేవిధంగా బీచ్‌పల్లి వద్ద ఉన్న వేరు సెనగ ఆయిల్ కంపెనీని మరమ్మతులు చేసి పామాయిల్ కంపెనీగా ఇదే సంవత్సరంలో ప్రారంభించుకుంటామని భరోసా ఇచ్చారు. రైతులు రాష్ట్రంలో అత్యధికంగా పామాయిల్ సాగుచేపట్టాలని రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోట సాగు చేయించి ప్రతి జిల్లాకు ఒక పామాయిల్ కంపెనీ స్థాపించడం ప్రభుత్వ లక్ష్యంగా ప్రకటించారు. రైతులు పంట మార్పిడి వైపు అలోంచించాలని వనపర్తిజిల్లాలో 11వేల ఎకరాల్లో సాగుకు లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పామాయిల్ సాగులో భారత దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలబడాలని తెలిపారు. దేవరకద్ర శాసన సభ్యులు, వనపర్తి శాసన సభ్యులు అడిగిన అన్ని అభివృద్ధి పనులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంకిరెడ్డి పల్లి గ్రామ ప్రజలకు పామాయిల్ కంపెనీ వల్ల ఎలాంటి నష్టం జరుగుకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, అవసరం అయి వారు కోరుకుంటే ఇక్కడి నుంచి తరలించడానికి సైతం వెనూకాడమని హామి ఇచ్చారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లా ప్రజలు ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న పామాయిల్ కంపెనీ ఎట్టకేలకు భూమి పూజ చేసుకోవడం జరిగిందని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రీయునిక్ సంస్థను కోరారు. జిల్లాలో ఇది వరకే సాగు చేసిన పంటకు గెలలు కోతకు వస్తున్నాయని, వాటిని కోసిన 24 గంటల్లో అయిల్ గా మార్చాల్సి ఉంటుందని లేనియెడల అది పనికి రాకుండా పోతుందన్నారు. భారత దేశం వంటనూనెలు, పప్పు దినుసుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వేరుశెనగ హెక్టారులో తీసిన వేరుశెనగ నుండి వంట నూనె 0.4 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అయితే పామాయిల్ గెల నుంచి హెక్టారుకు 4 మెట్రిక్ టన్నుల వంట నూనె ఉత్పత్తి అవుతుందన్నారు. పామాయిల్ సాగు వల్ల సంవత్సరానికి ఎకరాకు 1.5 లక్షల ఆదాయం వస్తుందని తెలియజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డ అని, బడుగు బలహీన వర్గాలు, రైతుల సమస్యలు తన సమస్యలు గా భావించి పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇంటింటి సర్వే, కులగణన విజయవంతంగా పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. స్థానిక శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సంకిరెడ్డి పల్లిలో పామాయిల్ కంపెనీ ఏర్పాటు వల్ల పర్యావరణ హానికర వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సహకార సంఘాల అధ్యక్షులు పదవీకాలం మరో 6 నెలలు పొడిగించినందున ధన్యవాదాలు తెలిపారు. భూత్పూర్ అడ్డాకుల మధ్య మరో మార్కెట్ యార్డు మంజూరు చేయాలని, దేవరకద్ర నియోజకవర్గంలో మరో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థం కలిగిన గోదాం ను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మండలాల్లో వ్యవసాయ అధికారులకు కార్యాలయాల కొరత ఉందని వాటిని మంజూరు చేయాలని, రైతులకు వ్యవసాయ పనిముట్లు మంజూరు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ కంపెనిలో పనిచేసేందుకు ఈ ప్రాంత ప్రజలకే ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 1680 మంది రైతులు 5500 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారని, త్వరలో 10 వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరత ఉందని వాటిని భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు వంతెనల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నామని, జిల్లాలో వేరుశెనగ సాగు ఎక్కువగా ఉన్నందున పెద్ద మందడి మండలంలో వేరు శెనగ పరిశోధన కేంద్రం మంజూరు చేయాల్సిందిగా మంత్రిని కోరారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన వన శాఖ మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, డి.సి.సి.బి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి .వెంకటేశ్వర్లు,ఆర్డీఓ సుబ్రమణ్యం, వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, దేవరకద్ర మార్కెట్ యార్డు చైర్మన్ ప్రశాంత్, పి.ఏ.సి.ఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కరెంటు కష్టాలను తీర్చిన నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి

**నూతన సబ్ స్టేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే**



నూతన సబ్ స్టేషన్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండలం పరిధిలో మల్లాపురం తాండా సమీపంలో సిద్దోని పల్లి గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. మల్లాపురం తాండా సమీపంలో సిద్దోని పల్లి గ్రామానికి సంబంధించిన 83 లక్షలు రూపాయలు వ్యయం 33/11 కెవి నిర్మాణం చేసిన సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఎమ్మెల్యే కి అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాలకులు గద్వాల ప్రాంతంలో రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలు చేశారు. రైతులు కరెంటు కోసం ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. కరెంటు లేక సరైన పంటలు లేక అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకునేవారన్నారు. గతంలో పాలించిన నాయకులు గ్రామాలలో సరిగ్గా విద్యుత్ లేక ఎంతో మంది ఇబ్బందులను పడేవారన్నారు. రైతులైతే పంట పొలాల పండగ కాక సరైన నీళ్ల వసతి లేక ఎన్నో ఇబ్బందులు పడి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవాడు అని పేర్కొన్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి ఈ ప్రాంతంలోని రైతుల యొక్క కష్టాలను తీర్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముఖ్యంగా తాగునీరు, విద్యుత్తు, వంటి సమస్యలతో ఎంతోమంది రైతులు ఇబ్బంది పడుతున్నారని విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి మండలంలో ట్రాన్స్ఫారంలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులకు నీటి సమస్యను విద్యుత్ సమస్యను లేకుండా కొంతమేరకు పరిష్కరించడం జరిగిందన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం, విద్యుత్ శాఖ మంత్రివర్యులు నేతృత్వంలో రైతులకు 24 గంటల కరెంటు, రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందజేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గద్వాల నియోజకవర్గం ప్రజలకు కరెంట్ అందజేస్తూ త్వరలోనే కొన్ని గ్రామాలకు సబ్ స్టేషన్లు మంజూరు కావడం జరిగిందన్నారు. త్వరలోనే వాటిని కూడా సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకొని గ్రామాలలో లో ఓల్టేజ్ సమస్యలను లేకుండా చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో కరెంటు లేకపోతే ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరు సమన్వయంతో విద్యుత్తును ఉపయోగించుకోవాలని కోరారు. విద్యుత్ అధికారులకు శ్రమకు విలువ కట్టలేదని ఏ ఒక్క చిన్నగా విలువైన వ్యాపార సంస్థ అయిన పెద్ద ఇండస్ట్రీ అయిన ప్రతిదానికి కరెంటు ఉండాల్సిందే కాబట్టి కరెంటు అధికారులు అనునిత్యం పనిచేయడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో కరెంటు పోవడంతో ప్రజలు అధికారులను ప్రజాప్రతిని తప్పుగా అర్థం చేసుకుంటారు. వారి సమస్యలను అర్థం చేసుకొని వారికి సహకరించాలని కోరారు. భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గంలో ఏ ఈ గ్రామంలో కూడా లో ఓల్టేజ్ కరెంటు లేకుండా చూసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మరికొన్ని గ్రామాలకు సబ్ స్టేషన్లు ట్రాన్స్ఫారం లో తీసుకువచ్చే విధంగా నా సాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కొరకు మీ అందరి ఆశీస్సులతో మరొక్కసారి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించినందు కు నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మండల విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామకృష్ణారెడ్డి, నాయకులు చక్రధర్ రావు, వెంకన్న గౌడ్, ఆంజనేయులు చంద్రశేఖర్, తిమ్మప్ప, తిక్క, గోపి, సురేష్ నాయక్, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు చేసిన మహిళలపై వేధింపులు సిగ్గుచేటు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని అన్నారు. కార్మికులు తిండి కూడా సరిగ్గా తినకుండా పనిచేస్తున్నారని అన్నారు. అలసిపోయి కూర్చున్న ఫోటోలు తీసి ఉద్యోగాల నుండి తొలగిస్తామని తీవ్రమైన మనోవేదనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సుజాత అనే పారిశుద్ధ్య మహిళా కార్మికురాలు క్లాస్ రూమ్ శుభ్రం చేస్తు జేబులో చెయ్యి పెట్టుకుంటే దొంగతనం చేసిందని అబండాలు మోపి కార్మికురాలని అక్రమంగా తొలగించారని తను ఏ తప్పు చేయలేదని వేడుకుంటూ నిన్న మండుటెండలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గేటు బయటనే ఉండి ఎండ తాపానికి స్పృహ కోల్పోతే తోటి కార్మికులు గుర్తించి అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారని అన్నారు. కావున ఉన్నతాధికారులు ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో దశలవారీగా ఉద్యమాలకు సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు మద్దిలేటి, వరుణ్, షెకిల్, రాజశేఖర్, మన్నెమ్మ ,చెన్నమ్మ ,పిరమ్మ ,సైదాబేగం ,లావణ్య ,నారమ్మ ,రమ్య, దేవమ్మ ,శివలిల, బొజ్జమ్మ ,రాజేశ్వరి ,ఇంద్రజా తదితరులు పాల్గొన్నారు.